ఈ వారం కథ



# రుణం

—భూషణం

పది గంటలు

కొండ ఎండ మండి పోతోంది.

శ్రీకాకుళ ఉద్యమంలో స్త్రీలు

రాయడానికని వింధ్య - సుధాకర్‌లు! వాళ్ళతో పాట్లు పడ్డానికి రాధిక రమణశ్రీ వారి చిన్నారి చెల్లెళ్ళూ మరిద్దరూ... కొండల్ని చూద్దామన్న సరదా!...

తూర్పు మూఠా పోరాట ప్రాంతం! అందులో మిగిలిన గిరిజన స్త్రీలను కలుద్దామన్న ఉద్దేశ్యంతో ఉత్సాహపు నడక!

కొండలు ప్రారంభం!

రోడ్ల మీద రిక్షాలూ - బస్సులూ - రైళ్ళూ - జీపుల ప్రయాణం తప్ప కొండలెక్కడం తెలియని అమ్మాయిలు! ఒక అబ్బాయీ కలిసిన నా వెనక నడక!

''వెంపటాపు సత్యం మాస్టారి చిన్న భార్య ఎక్కడ పని చేస్తుంది?! చిలకాంలోనా? సొబ్బ లోనా?!''

రావాడ రామభద్రపురం. చిలకాం. సొబ్బ - నాగరి! అటు దిగితే మొండెమ్ బొల్లు! ఇటు వెళితే నీలకంఠాపురం!!

అందరమూ వడుస్తున్న దారికి - అటు పది మైళ్ళూ - ఇటు పది మైళ్ళూ - అనాటి పోరాట ప్రాంతం.

ఆ నడకలు! ఆ పాటలు!! ఉత్సాహ ఉద్రేకాల ఉరుకుల పరుగులు!.

ఇదే దారి! ఇదే మట్టి! ఇదే గాలి! ఇవే కొండలు!.

ఆడబిడ్డలు కుతూహలంతో ప్రశ్నలు!! సుధాకర్ నడక మౌనం!

చిలకాం 'గాటీ' ప్రారంభం!

నా మాటలు! ఆలోచనలు! పాత స్మృతులు!.

ముందు 'గాటీ' రాతి మీద నడక!.

ఎలా నడుస్తారు?.

''మేస్త్రండీ! చెప్పు తెగిపోయిందండీ!''

''చేత్తో పట్టుకొని నడువమ్మా!''

ఇదే దారి! ఇదే... ఇక్కడే...!

కాపలా - తుపాకులు - ప్రమాదం - నిశ్శబ్దం - గోల - బాధ - హింస!

అమరుల అడుగులు - నడకలు-!-

అమలిన హృదయ సంస్పందన!

భయం! ధైర్యం - సాహసం - పొంచి ఉండడం - ముందుకు రావడం - ఒరిగిపోవడం! పరుగులు.

పసడిపోవడం - లేవడం - పడిపోవడం!

ఇదే మట్టి - ఇదే దారి - ఇదే కొండ!

ఈ పక్కనే కాల్పులు! ఆరుగురు దొరికి పోవ

డం! ముగ్గురు వెంటనే చనిపోవడం! మరి ముగ్గురు ప్రాణాలతో హింస! మళ్ళీ కాల్చి వాళ్ళ బాధ పోగొట్టడం!

రెండు దశాబ్దాలు గడిచిపోయిందా?!.

పోయిన గిరిజనులు ముగ్గురు!. పోకుండా గిల గిల తన్నుకుంటూ గిజ గిజలాడుతూ ఆర్తనాదం తరవాత మళ్ళీ కాల్చగా ముగ్గురు హాహాకారం!.

కొండలు ఓం కార నాద ధ్వని!.

నా వెనక నడుస్తున్న ఆడ బిడ్డలు-

"మాస్టారూ! ఇంకెంత దూరం?

"చాలా నడవాలమ్మా"

ఎత్తుగా రాతి మీద నడక!

"జారితే లోయ! జాగర్త తల్లుల్లారా!"

ఎన్ని జాగర్తలు? అయినా ఎందరు పడి పోయారు?!.

పడిపోయారు!. వెళ్ళిపోయారు!. పోయారు!. ఇదే దారి!. ఇదే మట్టి! ఇదే గాలి! ఈ కొండలే!.

ఎదురుగా తట్టలూ - కావిళ్ళూ - కొందరు దిగుతున్నారు. గిరిజనులు!.

చీర కట్టూ - జాకెట్టూ - జుట్టు ముడి!

పల్లపు స్త్రీల అలంకరణ!

'గాటీ' దిగుతున్నారు.

నా వెనక అలసిన ఆడ బిడ్డలు ఆగుదామన్నారు!.

నా వెనక అలసిన ఆడ బిడ్డలు ఆగుదామన్నారు!.

"చెట్టు వెతకాలమ్మా!"

అడవిలో ఆగడానికి చెట్టు వెతకాలి.

ఎండ మండిపోతోంది. కాళ్ళు కాలిపోతున్నాయి!.

శరీరం అంతా చెమటలు! కొండగాలి లేదు!.

ఇక్కడ - ఆనాడు - దట్టంగా అడవి! దారి పొడవునా నేరేడు - తుమ్మిక - జారుమామిడి - మామిడి - వాకాయ పళ్ళ రుచులు!.

చింత చెట్లు గుగ్గిలం 'ఓకు' మడ' మధ్య దారులు!. సూర్యకిరణం కూడా నేలపడనీయని తీగల గొడుగు!.

ఆనాటి అడవి! అడవి పూల సువాసనలు!

ఆనాటి మనుషుల నడకలు! ఆ పాదాల గుర్తులు!!.

ఏవీ? ఇక్కడ ఇప్పుడా గుర్తు లున్నాయా?! అంతా మాసిపోయి మరచిపోయిన నేలా ఇది?!.

ఎదరగా వచ్చిన గిరిజనులు!. చెట్టు కింద ఆగిన వారు సేద తీర్చుకుంటున్నారు!.

గిరిజనుల గుంపులో వున్న మగాడు గుర్తించినట్టున్నాడు!. రెండు దశాబ్దాలు గడిచిపోయినా గుర్తింపు!

"ఎవులు గురువూ?" నాతో మున్న వార్ని చూపిస్తూ, అడిగాడు!.

ఎవరని చెప్పడం? చెబితే తెలుస్తుందా?!

"మీ ఊరు చూడ్డానికి వస్తున్నారు." అన్నాను. అతను అనుమానంగా

"అంతా సూసేసి సేసేసి వారు గదా! ఇంకేటి సూత్తారు గురువా?"

"పోరాటంలో పాల్గొన్న ఆడవాళ్ళ గురించి రాస్తారు" అతనికి అదేమీ అర్థం కాలేదు..

"గురువూ! అలా గుండీ వోడివి! అది గప్పుడు నాను గుంటడ్ని! మా ఇంటికి తిండి కొచ్చినావు గద!. ఇదిగిలాగ అయిపోనావేటి?"

ఆ పరామర్శ స్ఫురింపుకి నా కళ్లలో నీరు గిర్రున తిరిగింది!.

"నాయుడి కొడుకువా?" అన్నాను.

"సుట్టాన్ని! మాది సిలకాం కాదు"

గిరిజనుడికి మాస్టారు రుణపడ్డారా? మాస్టారికి గిరిజనుడు రుణపడ్డాడా? చాలా చిక్కు ప్రశ్నే. ఆ రుణమైనా రూపాయల రుణమా? గిరిజనుడి బతుక్కి పూర్తిగా పూచీ పడిన రుణం! ఈ 'రుణం' సంగతి తేల్చుకోవాలంటే శ్రీకాకుళ రణం ముందుకు.. కొండలు పుట్టిన నాటికి, కొండల్లో గిరిజనుడు పుట్టిన నాటికి వెళ్ళి శోధిస్తే తప్ప తేలేది కాదు.

అప్పుడైనా ఒకరు మరొకరికి బాకీ పడ్డారా? పరస్పరం బాకీ పడ్డారా? అయితే ఎవరి బాకీ ఎవరు తీర్చాలి? అదీ ప్రశ్నే!

"మీరు మారిపోలేదా?" అడిగాను.

"మారిపోనాం గురువా! మమ్మల్ని మారిసేసినారు!. మా ఆడ గుంటల్నీ మార్సేసినారు! ఆ గుంట ముండ పాపల్ని సూడు."

గుంపుగా మున్న ఆడవార్ని చూపించాడు.

"సూసినావు కదా! అద్దంలోన ఆల మొకాలు ఆలు సూసుకున్నారు! అద్దం గురువా! మరిప్పుడు ఆలమొకాలు ఆలవి కాకుండా సేసుకున్నారు. మాకు దక్కకుండా మా కళ్ళెదటే ఎలిపోతున్నారు?" అన్నాడు.

ఆశ్చర్యంగా చూస్తున్న నాతో

"నిజిం గురువా!. అల్లప్పుడు నా సిన్నప్పుడు మా ఊళ్ళు తగలెట్టేసినప్పుడు గోర కలి జరిగిపోయి గగ్గోలు అయిపోతున్నప్పుడు మా కళ్ళెదట రెక్కట్టుకు లాక్కుపోతే కీచుమని కేకలైనా ఏసీ వోళ్ళు! ఇప్పుడు గురువా?! కిల కిలమని నవ్వుకోని కిసకిసలాడుకోని ఎలిపోతున్నారు! అద్దంలో మొకాలు సూసుకోని అదిగలాగ తయారై పోనారు!"

మరి నాకతని మాట వినబడలేదు.

అద్దం!

ఈ కొండ మీదకి అదెవడు తెచ్చాడు?!

అద్దం! అంత పని చెయ్యగలదని అంతవరకూ నాకు ఆలోచన అందలేదు!.

నా కళ్ళకు...

అద్దాల 'గెస్ట్ హౌస్' లూ - అద్దాల హోటళ్ళూ - అద్దాల సినిమా హాళ్ళలో అసభ్య అంగ భంగిమ ప్రదర్శనలూ అద్దాల పల్లెలూ - అద్దాల పట్నాలూ అద్దాల నగరాలూ అద్దాల మహా నగరాలూ...!

అద్దాల ముందు ఆడవారు?!

అలంకరణలు! ఫలితాలు! ఒక్కసారి గిర్రున తిరిగాయి!.

అద్దంలో చూసుకున్న పతనం అదెంత? అభ్యుదయం అదెంత!, వాళ్ళు వాళ్ళలా ఉన్నారా? వాళ్ళు ఎవరిలా తయారై పోవాలని అనుకుంటూ అద్దం అలంకరణలు!.

చూపులు?! అవెన్ని? ఎలాంటివి?

రూపులు?! ఎలా మారిపోయి ఎటుపోతున్నాయి?!

తెగని ఆలోచనలు!

అద్దం కొండ మీదకి ఎక్కింది!

అద్దం! కొండని పట్టేసింది!.

అద్దం! మరకల్ని చెరపడానికా? మచ్చల్ని పెట్టడానికా?!

"కొండ అద్దమందు కొంచెమై ఉండదా?" పద్యం జ్ఞాపకం!

కొండ కొంచెం అయిపోయిందా?!

ప్రశ్నలూ - ఆలోచనలూ?!

ఆలోచనలు ఆగిపోయినట్టుగా

"మేస్త్రండీ! ఊరు!" రాధమ్మా రమణశ్రీల సరదా కేక!

గ్రామం దిశగా నడక!

అందరం గ్రామంలో గల పాఠశాల చేరుకున్నాం.

నా బరువును ఆ పాఠశాల ఉపాధ్యాయులు పంచుకున్నారు.

ఆదరణ! విశ్రాంతి!

వచ్చిన పని చెప్పగా కావలసిన వాళ్ళను వారే తీసుకొని వచ్చారు!

వింధ్యమ్మ తను వచ్చిన పని పై ప్రశ్నలు॰ సంశయిస్తున్న వాళ్ళ సంశయం తీర్చడానికి ''వీళ్ళు మనోళ్ళే'' అనిపించాను.

''మనోలా గురువూ! మళ్ళీ వొచ్చినారా?''

నేను మౌనం వహించాను.

మౌనంగా ''నేను ఇప్పుడు ఎవర్ని''??

నా కాళ్ళకు డెక్కలు మొలిచాయి! నా తల మీద కొమ్ములొచ్చాగే! నా కడుపునొప్పి! మూల మంచం మీద ముడుచుకొని పడక!

''మేస్త్రండీ!'' మళ్ళీ ఆడబిడ్డల పిలుపు!

లేచి నడుస్తున్నాను.

ఈ నడకలో, మరో ఊరికి దారి చూపించ డానికి ముందు నడుస్తున్నది చిలకాం ఉపాధ్యాయుడు!

నేను వెనెక నడుస్తున్నాను.

వెనకబడి పోయిన వయుసు...! నా వెనక ఎవరున్నదీ గమనించవలసిన ప్రదేశానికి చేరక ముందే

''గురువూ!'' అని సన్నగా కొండ పిలుపు.

తిరిగి చూశాను.

అలనాటి ముసలి గిరిజనుడు.

''పార్తి పట్టినావా?'' అడిగాడు. అడిగిన వెంటనే -

''మనోలొచ్చినారు గదా! నాదొక మాట!''

నేను ఏమిటన్నట్టు చూశాను.

ముసలి గిరిజనుడు మెల్లగా

''గురువూ! పెద్ద గురువు నేడా?! ఇరవై పంటల కిందట మనూర్ల కొచ్చినప్పుడు నా ధగ్గిర నాటు తుపాకీ తీసుకున్నాడు. ఆరు వందలు ఇస్తానన్నాడు.'' అంటూ ఆగాడు.

నేను ఆశ్చర్యంగా

''ఎవరూ? వెంపటాపు సత్యం మాస్టారా?'' అని అడిగాను.

''అవును గురువూ! మాట తప్పనోడు! ఆ గురువే! ఎలిపోనాడు మరి! ఎవుర్ని అడుగుతాం సెప్పు మీ! ఇదుగోటి ఇప్పుడొచ్చిన మనోలు గురువు బాకీ తీరుస్తారేటి? అడుగు మరి!'' అన్నాడు.

నా నెత్తిన ఎదరగా నున్న కొండమీద నుండి పెద్ద 'రాయి' ఎగిరి పడ్డట్టయింది.

ఇప్పటికీ ఎప్పటికీ వెంపటాపు సత్యం మాస్టారి రుణం ఈ ప్రాంతం తీర్చలేదు గాక తీర్చ లేదనుకున్న నాకు -

వెంపటాపు సత్యం మాస్టారు నా రుణం తీర్చలేదన్న ముసలి గిరిజన ముఖం...?!

తుపాకి తూటా దెబ్బ తిని పడిపోయిన వెంపటాపు సత్యం మాస్టారి మంచం మీద ఆనాటి మరణ రూపం...?

ఎదరగా రెండు రూపాలు?!.

అప్పటి వరకూ నేననుకున్నది తలకిందులు కాగా నా కాళ్ళ కింద మట్టి కరిగిపోతున్నట్టని పించగా ఎన్నో ఆలోచనలు!.

'ఎవరి రుణం ఎవరు తీరుస్తారు?. తీర్చగలరు?!

గిరిజనుడికి వెంపటాపు సత్యం మాస్టారు బాకీ పడిపోయారా?

గిరిజనులు వెంపటాపు సత్యం మాస్టారికి రుణపడి వున్నారా?!'

రెండు ప్రశ్నలు!.


'రుణ' సమాధానం నా దగ్గర లేక ఎదరగా మున్న ముసలి వానికి నమస్కరించి నడిచి వెళ్ళిపోయాను!.


ఆయీ, ఆయీ బబూల్ కీ బహార్!



ప్రతి పదిమందిలో తొమ్మిది మంది చిగుళ్ళ జబ్బులతో బాధపడ్తున్నవారే. దంతక్షయానికి ముఖ్యకారణం ఈజబ్బులే. బబూల్ టూత్‌పేస్ట్‌లో నల్లతుమ్మ సారమున్నది. ఇది, చిగుళ్లను బలపర్చుకోడానికై అందరికీ తెలిసిన, అందరూ నమ్మిన పారంపరిక ప్రాకృతిక ఉపాయము. దీనితో చిగుళ్లకు ఎక్కువ స్వస్థత చేకూరుతుంది. ఫలితంగా పళ్లకు మరింత గట్టిదనం, శ్వాసలో మరింత తాజాదనం!

బల్సారా—
టూత్‌పేస్ట్
విశేషజ్ఞులు
BALSARA




ఇంటిల్లిపాదికీ ఉపయోగకరం! ధర స్వల్పం!

Chaitra-B BLS 952 R TEL